క్లుప్తంగా

గ్రామ కార్మికుల వినూత్న నిరసన

చిలప్‌చెడ్(నర్సాపూర్): ఎనిమిది నెలలుగా తమకు జీతాలు చెల్లించడం లేదంటూ పంచాయతీ కార్మికులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. బుధవారం మండలంలోని గౌతాపూర్ గ్రామ కార్మికులు గ్రామంలో భిక్షాటన చేశారు. అనంతరం గ్రామ చౌరస్తా వద్ద భిక్షంగా వచ్చిన ఆహారాన్ని భుజించారు. . ఈ కార్యక్రమంలో ప్రభాకర్, మాణిక్యం, యాదగిరి పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ముట్టడి



రామతీర్థం సబ్ స్టేషన్‌ను ముట్టడించిన గిరిజన రైతులు

పాపన్నపేట(మెదక్): మూడు రోజులుగా త్రీఫేజ్ కరెంట్ రావడం లేదని గిరిజన రైతులు బుధవారం రామతీర్థం సబ్‌స్టేషన్‌ను ముట్టడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు రోజులుగా మొదల్లకుంట, నర్సింగరావుపల్లి గిరిజన తండాలకు త్రీఫేజ్ కరెంట్ సరఫరా నిలిచి పోయిందన్నారు. తమ పక్కనే ఉన్న మల్లంపేట, రామతీర్థం గ్రామాలకు కరెంట్ సరఫరా ఉండగా, తమ గ్రామాలకు మాత్రం విద్యుత్ లేదన్నారు. వరినాట్లు వేసుకునేందుకు ఏర్పాటు చేసుకోగా, సుమారు 100 ట్రాన్స్ ఫార్మర్ల క్రింద వరి నారు ఎండిపోతుందని వాపోయారు. ఈ విషయమై ఏఈకి ఎన్నిసార్లు ఫోన్ చేసినా.. స్పందించడం లేదన్నారు. దీంతో సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేశామన్నారు.

దాహార్తి తీర్చడం అభినందనీయం

వెల్దుర్తి(తూప్రాన్): ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం వాటర్‌ప్లాంట్ ఏర్పాటుచేయడం అభినందనీయమని రంగంపేట పీఠాధిపతి మాధవానంద సరస్వతి స్వామి అన్నారు. మండలంలోని భస్వాపూర్ మల్లన్నగుట్ట వద్ద విజయలక్ష్మి, భూంలింగంగౌడ్ దంపతులు ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వెల్దుర్తి జెడ్పీటీసీ రమేశ్‌గౌడ్ వాటర్‌క్యాన్‌లను పంపిణీచేశారు.కార్యక్రమంలోఆలయ కమిటీ చైర్మన్ మల్లేశం, సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సమస్యలు ఉండొద్దు

పెద్దశంకరంపేట(మెదక్): గ్రామాల్లో సమస్యలు ఉండొద్దని ఎంపీడీఓ రఫీఖ్ ఉన్నీసా గ్రామ కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామకార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ.. వనమహోత్సవంలో భాగంగా అన్ని గ్రామాల్లో గుంతలు తీసే పనులు పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ నవాజుద్దీన్, వెంకటరాములు తదితరులు ఉన్నారు.

వీరభద్రాలయం పరిశీలన

టేక్మాల్(మెదక్): మండలంలోని బొడ్మట్‌పల్లి భద్రకాళీ సమేత వీరభద్రాలయాన్ని అల్లాదుర్గం సీఐ రేణుక బుధవారం సందర్శించారు. దొంగతనం విషయమై స్వామి వారి, అమ్మవారి ఆభరణాలు ఏం పోయాయని, ఎలా జరిగిందని అర్చకుడు వీరయ్యస్వామికి, గ్రామస్తులకు అడిగి తెలుసుకున్నారు. ఆలయంలో ఉన్న సీసీ పుటేజీలను పరిశీలించారు. దుండగులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సీఐ వెంబడి ఎస్ఐ మురళి, పోలీసు సిబ్బంది ఉన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నిరుద్యోగ భృతి అందించండి

చిన్నశంకరంపేట(మెదక్): అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి అందిస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు నెరవేర్చలేదని బీజేవైఎం బీజేపీ నాయకులు తహసీల్దార్ మన్నన్‌కు వినతిపత్రం అందించారు. బుధవారం బీజేవైఎం జిల్లా కార్యవర్గ సభ్యులు మధు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుద్యోగ భృతి అందిస్తామని ఆరు నెలలు దాటినా.. ముఖ్యమంత్రి మాట్లాడటం లేదన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు రాజు, బీజేవైఎం మండల కార్యదర్శి రాజు, నాయకులు అశోక్, నవీన్ తదితరులు ఉన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం



మొక్కలు నాటుతున్న ప్రజా ప్రతినిధులు

టేక్మాల్(మెదక్): మండల పరిషత్‌లో ఎంపీపీ స్వప్న అధ్యక్షతన ఎంపీడీఓ రియాజొద్దీన్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశం సాదాసీదాగా నిర్వహించారు. పలు అభివృద్ధి అంశాలపై ఆయా శాఖల అధికారులతో ప్రజా ప్రతినిధులు చర్చించారు. ఈ సందర్భంగా ఎంపీపీ స్వప్న, జెడ్పీటీసీ సరోజ, ఎంపీటీసీల ఫోరం జిల్లా ఉపాధ్యక్షురాలు వాణి, జిల్లా కోఆప్షన్ సభ్యులు యూసూఫ్ మాట్లాడారు. అధికారులు, ప్రజాప్రతినిధులను ఎంపీపీ స్వప్న, మాజీ సర్పంచ్‌లు, నాయకులు, యువజన సంఘాల సభ్యులు సన్మానించారు.

రారెత్తిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు



సాలోజిపల్లిలో కాలిన ట్రాన్స్‌ఫార్మర్ వద్ద రైతులు

- అవస్థలు పడుతున్న రైతులు
- పట్టించుకోని అధికారులు

టేక్మాల్(మెదక్): విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం రైతులకు శాపంగా మారింది. విద్యుత్ సరఫరా సక్రమంగా చేయకపోవడంతో నిత్యం ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. వ్యవసాయ పనులకోసం బోర్లు వేస్తున్నా..అవి కాలిపోవడంతో కలత చెందుతున్నారు. మరమ్మతుల్లో సైతం అలసత్వం వహించడంతో నానా ఇబ్బందులు పడుతున్నారు. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టిపట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టేక్మాల్ మండలంలోని సాలోజిపల్లి, టేక్మాల్, ఎల్లుపేట, హెచ్‌ఎంపల్లి తదితర గ్రామాల్లో నెల రోజులుగా వారంలో రెండు నుంచి మూడు ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతున్నాయి. విద్యుత్ సరఫరా సక్రమంగా చేయకపోవడంతో, చీటికి మాటికి కరెంట్ తొలగించడం, మరమ్మతులు సైతం సక్రమంగా చేయడంలేదని రైతులు వాపోతున్నారు. ఇలా ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవడంతో రవాణా, కూలీల చార్జీలు తమపై పడుతుందన్నారు.

ఎండుతున్న తూకాలు..

ట్రాన్స్‌ఫార్మర్‌లు కాలిపోవడంతో పోసిన తూకాలకు నీరందక ఎండిపోతున్నాయి. వరి సాగు కోసం పొలాలను దున్నేందుకు సిద్ధమవుతున్న రైతులు కాళ్లు చేతులు ఆడడంలేదన్నారు. విద్యుత్ సమస్యలు, ట్రాన్స్‌ఫార్మర్‌ల కాలిపోవడంతో కంటి మీద కునుకులేకుండా పోతుందని వారు వాపోయారు. జిల్లా అధికారులు స్పందించి నాణ్యమైన విద్యుత్ సరఫరాతో పాటూ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు వెంటనే బాగు చేయించాలని రైతులు కోరుతున్నారు.

ధరణి సమస్యలు వెంటనే పరిష్కరించండి

ఆర్డీఓ రమాదేవి



చిన్నశంకరంపేట తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీఓ రమాదేవి

చిన్నశంకరంపేట(మెదక్): ధరణి పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని మెదక్ ఆర్డీఓ రమాదేవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయంలో ఆర్డీఓ రికార్డుల తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధరణి పెండింగ్ ఫైళ్లు కార్యాలయ పరిధిలోనే ఉంచొద్దని పేర్కొన్నారు. రైతులు చిన్నచిన్న భూసమస్యల పరిష్కారం కోసం కలెక్టర్ కార్యాలయానికి వస్తున్నారని తెలిపారు. ఇక నుంచి ధరణిలో పెండింగ్ సమస్యలు ఉంచొద్దని ప్రభుత్వం ఆదేశాలు జారీచేసినట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు ధరణి సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ అంశాలపై తహసీల్దార్ మన్నన్‌కు పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఉప తహసీల్దార్ మహేదర్‌గౌడ్, ఆర్ఐ చంద్రశేఖర్ రెవ్యూ సిబ్బంది ఉన్నారు.

వన మహోత్సవానికి సిద్ధం చేయండి

ఎంపీడీఓ శ్రీనివాస్



చండూర్‌లో మాట్లాడుతున్న ఏపీఓ శ్యాం

కౌడిపల్లి(నర్సాపూర్): వన మహోత్సవం మొక్కలు నాటడానికి అంతా సిద్ధం చేయాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 పంచాయతీల్లో లక్ష 11వేల మొక్కలు నాటడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.అన్ని గ్రామాలు, తండాల్లో సంపూర్ణ పారిశుద్ధ్యం ఉండాలని తెలిపారు. వర్షాకాలం సందర్భంగా వ్యాధులు ప్రభలకుండా మురికి కాల్వలు, పరిసరాల్లో చెత్తలేకుండా శుభ్రం చేయించాలని చెప్పారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీఓ వెంకటేశం కార్యదర్శులు పాల్గొన్నారు.

నాటిన ప్రతి మొక్కను సంరక్షించాలి

చిలప్‌చెడ్(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతీ మొక్కను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఏపీఓ శ్యాం అన్నారు. ఆయన చిలప్‌చెడ్ మండలం చండూర గ్రామంలో ప్రారంభించిన వనమహోత్సవాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఏ ప్రదేశాల్లో ఏ మొక్కలు నాటాలో ఫీల్డ్ అసిస్టెంట్ సత్యంకు సూచించామన్నారు. అనుకున్న సమయంలో వనమహోత్సవ లక్ష్యాన్ని పూర్తి చేస్తామన్నారు. నాటిన మొక్కలను ధ్వంసం చేస్తే చర్యలు తప్పవన్నారు.

6న పెంపుడు కుక్కలకు టీకాలు

నర్సాపూర్: రేబిస్ వ్యాధి నివారణకు టీకాలు ఇస్తామని పశు సంవర్ధక శాఖ ఏడీ డాక్టర్ జనార్ధన్‌రావు అన్నారు. ఈనెల 6న పెంపుడు కుక్కలకు తమ శాఖ ఆధ్వర్యంలో ఉచిత టీకాలు ఆస్పత్రిలో ఇవ్వనున్నట్లు ఏడీ డాక్టర్ చెప్పారు.

ఎమ్మార్పీఎస్ జెండా పండుగ జయప్రదం చేయండి

వెల్దుర్తి(తూప్రాన్): జిల్లాలోని అన్ని గ్రామాల్లో ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దండోరా జెండావిష్కరణను విజయవంతం చేయాలని ఆ సంఘం జాతీయ నాయకుడు యాదగిరిమాదిగ అన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి

హవేళిఘణాపూర్(మెదక్): స్థానిక జెడ్పీ హైస్కూల్‌ను డీఈఓ రాధాకిషన్ బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బోధన తీరును, రికార్డులను, భోజనాన్ని పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు అర్థమయ్యే విధంగా బోధించి వందశాతం ఉత్తీర్ణత సాధించే విధంగా కృషి చేయాలని సూచించారు.

గవ్వలపల్లిని సందర్శించిన డీఎల్‌పీఓ

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని గవ్వలపల్లి గ్రామాన్ని డీఎల్‌పీఓ సతీశ్‌కుమార్ బుధవారం సందర్శించారు. వీధులను శుభ్రంగా ఉంచాలని, ప్రతిరోజు చెత్తను సేకరించి కంపోస్టు ఎరువును తయారుచేసి ఎవెన్యూ ప్లానిటేషన్ మొక్కలకు వేయాలని సూచించారు. రికార్డులను పరిశీలించి ఎంబీలు లేకుండా ఎలాంటి బిల్లులు చెల్లించరాదని గ్రామ కార్యదర్శి వెంకటేశ్‌కు సూచించారు.



చిన్నశంకరంపేట(మెదక్): చందంపేటలో రైతుల వివరాలు సేకరిస్తున్న అధికారులు

సాగు భూములకు భరోసా ఇవ్వాలి

చేగుంట(తూప్రాన్): సాగు చేసుకుంటున్న భూములకు మాత్రమే రైతు భరోసా అందించాలని రైతులు కోరారు. మండల కేంద్రమైన చేగుంటలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో చేగుంటలో రైతు భరోసా అభిప్రాయ సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ వసంత సుగుణ మాట్లాడుతూ.. రైతు భరోసా అందించే విషయంలో రైతులు ప్రభుత్వానికి అభిప్రాయాలు తెలపాలని సూచించారు. వ్యవసాయ అధికారి హరిప్రసాద్, సహకార సంఘం చైర్మన్ రాములు, రఘురాంలు రైతులు పాల్గొన్నారు.

చిన్నశంకరంపేట మండలంలో....

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని చందంపేటతో పాటు జంగరాయి గ్రామంలో సహకార సంఘం ఆధ్వర్యంలో అభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీసీఓ కరుణ పాల్గొని రైతుల అభిప్రాయాలను సేకరించారు. పది ఎకరాల లోపు రైతులకు షరతులు లేకుండా రైతు భరోసా అందించాలని తీర్మానం చేయించారు. చైర్మన్‌లు సత్యనారాయణ, శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ కృష్ణగౌడ్, డైరెక్టర్ రామకృష్ణ, ఎంపీటీసీ శివకుమార్, నాయకులు అంజిరెడ్డి, రవీందర్‌రెడ్డి, సిద్ధిరాములు, స్వామి, యాదగిరి, సీఈఓ బాలకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

నేడు వెల్దుర్తి పీఏసీఎస్ కార్యాలయంలో రైతుభరోసా

వెల్దుర్తి(తూప్రాన్): మండల కేంద్రంలోని పీఏసీఎస్ కార్యాలయంలో రైతుల అభిప్రాయ సేకరణ కార్యక్రమం ఏర్పాటు చేశామని సొసైటీ సీఈఓ సిద్ధయ్య పేర్కొన్నారు. ఉదయం 11:30 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కానున్నట్లు తెలిపారు.

రైతు సంక్షేమాన్ని గాలికొదిలేసిన ప్రభుత్వం

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

మనోహరాబాద్(తూప్రాన్): రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం గాలికొదిలేసిందని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించారు. మండలంలోని గౌతోజీగూడెం గ్రామంలో రూ.10లక్షల జెడ్పీ నిధులతో చేపట్టిన అంతర్గత మురికి కాల్వ పనులను జెడ్పీచైర్‌పర్సన్ హేమలతతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ మాజీ ఉపసర్పంచ్ రేణుకుమార్ అతిథులు, ప్రజాప్రతినిధులను సన్మానించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతీ గ్రామానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలం చెందిందన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

నిరుద్యోగులను మోసం చేస్తున్న కాంగ్రెస్



తహసీల్దార్‌కు వినతిపత్రం అందచేస్తున్న బీజేవైఎం నాయకులు

నర్సాపూర్: నిరుద్యోగులను కాంగ్రెస్ మోసం చేస్తుందని బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి భరత్‌రాం ఆరోపించారు. ఆయన బుధవారం మండల తహసీల్దార్ కమలాద్రికి వినతిపత్రం అందజేశారు. నిరుద్యోగుల సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకుపోవాలని కోరారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతూ నిరుద్యోగులను మోసం చేస్తుందని ఆరోపించారు. ఆయన వెంట బీజేవైఎం నాయకులు శ్రీకాంత్, పండరి, ఆజయ్ సింగ్, రాజు, విజయ్ ఉన్నారు.

ఉద్యోగ క్యాలెండర్‌విడుదల చేయాలి

శివ్వంపేట(నర్సాపూర్): రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ క్యాలెండర్‌ని విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ బీజేవైఎం నాయకులు బుధవారం తహసీల్దార్ శ్రీనివాస్‌చారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేవైఎం మండలాధ్యక్షుడు భాస్కర్ మాట్లాడుతూ.. పదేళ్ల కాలంలో నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. నాయకులు, భిక్షపతి, ఆంజనేయులు, నాగరాజు, సుధాకర్, శ్రీకాంత్, రత్నాకర్ ఉన్నారు.

మత్తుపదార్థాలకు అలవాటు పడొద్దు

ఎస్ఐ రంజిత్‌రెడ్డి



పెద్దశంకరంపేట(మెదక్): సైబర్‌నేరాలపై మాట్లాడుతున్న ఎస్ఐ శంకర్

కౌడిపల్లి(నర్సాపూర్): సైబర్ క్రైంపై అప్రమత్తంగా ఉండాలని, మత్తు పదార్థాలకు అలవాటు పడొద్దని ఎస్ఐ రంజిత్‌రెడ్డి, ఏఎస్ఐ విఠల్ తెలిపారు. బుధవారం మండలంలోని కొత్తచెరువు తండా పంచాయతీ మొండితండా వద్దగల రైస్‌మిల్ వద్ద పనులు చేసే బిహార్ కార్మికులకు పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులు పనులు చేసేటప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఫోన్‌చేసి గుర్తుతెలియని వ్యక్తులు ఓటీపీ, పిన్‌నంబర్, బ్యాంక్ అకౌంట్ ఇతర వివరాలు అడిగితే చెప్పవద్దన్నారు. ఓటీపీ అడిగి బ్యాంక్ నుంచి మనకు తెలియకుండానే డబ్బులు దోచేస్తారని చెప్పారు. డ్రగ్స్, మత్తుపదార్థాలు, గుట్కా, మద్యం ఇతర మత్తుకు దూరంగా ఉండాలని చెప్పారు. రాత్రిపూట ఎక్కడికి వెళ్లొద్దని చెప్పారు. ఏఎస్ఐ విఠల్, ఎస్‌హెచ్‌ఓ ఏలియాస్‌రెడ్డి, పీసీలు శంకర్, శ్రీకాంత్, రాములు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి

పెద్దశంకరంపేట(మెదక్): సైబర్ నేరాలపై ప్రతీ ఒక్కరికి అవగాహన తప్పకుండా ఉండాలని ఎస్ఐ శంకర్ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైబర్ జాగృతి దివస్ సందర్భంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులకు సైబర్ నేరాలపై వివరించాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అవనీష్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీపీ, ఎంపీటీసీలకు సన్మానం

జిల్లా వ్యాప్తంగా బుధవారం ఎంపీపీ, ఎంపీటీసీల ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీల పదవీకాలం ముగుస్తున్నందున ఆయా మండలాల్లో ఎంపీపీ, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీడీఓలు, వివిధ శాఖల అధికారులు, బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



పాపన్నపేట(మెదక్): ఎంపీపీని సన్మానిస్తున్న నాయకులు, అధికారులు



చేగుంటలో ..



వెల్దుర్తిలో..



నిజాంపేటలో ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న నాయకులు



రామాయంపేటలో ఎంపీపీ, ఎంపీటీసీలను సన్మానిస్తున్న అధికారులు



కొల్చారంలో..

సంక్షిప్త వార్తలు

◆ **ఆలయ నిర్మాణానికి ఆర్థికసాయం**

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల పరిధిలోని గౌతాపూర్ గ్రామంలో నిర్మించనున్న హనుమాన్ ఆలయ నిర్మాణం కోసం బుధవారం చిలప్‌చెడ్ మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షురాలు లక్ష్మీదుర్గారెడ్డి తనవంతు సాయంగా రూ. 10 వేల విరాళం అందజేశారు. కార్యక్రమంలో గౌతాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ అంజిరెడ్డి, నాయకులు విఠల్, గోవర్ధన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, పాల్గొన్నారు.

◆ **వంగపల్లి దీక్షను విజయవంతం చేయాలి**

చేగుంట(తూప్రాన్): వర్గీకరణ బిల్లు జాప్యంను నిరసిస్తూ టీఎస్ ఎమ్మార్పీస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ దీక్షను విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ అన్నారు. చేగుంటలో దీక్షకు సంబంధించిన కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. 7న ఇందిరాపార్కు వద్ద వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో దీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కృష్ణ, దుర్గపతి, సిద్ధిరాములు, రాములు, సాయిబాబా, నాగరాజు, కిష్టయ్య పాల్గొన్నారు.

◆ **హైమాస్ట్ లైట్లు ప్రారంభం**

చేగుంట(తూప్రాన్): మండల కేంద్రం చేగుంటలోని మోడల్ కాలనీలో బుధవారం ఎంపీపీ శ్రీనివాస్ హైమాస్ట్ లైట్లను ప్రారంభించారు. ఎంపీటీసీ వెంకటలక్ష్మి, కాలనీవాసులు పాల్గొన్నారు.

◆ **పేదల సంక్షేమమే ధ్యేయం**

రేగోడ్(మెదక్): పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పీసీసీ సభ్యుడు మున్నూరు కిషన్ అన్నారు. రైతు వేదిక కార్యాలయంలో బుధవారం 17 మంది లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాల లక్ష్మి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు దిగంబర్ రావు, జెడ్పీటీసీ యాదగిరి, ఎంపీపీ సరోజన, కోఆప్షన్ సభ్యుడు చోటు మియా, ఎంపీటీసీ నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

◆ **వైద్యులు.. దైవ సమానులు**

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రంలో జీఎంఆర్ వరలక్ష్మి ఫౌండేషన్ ఆధ్వర్యంలో జాతీయ వైద్య దినోత్సవం(డాక్టర్స్ డే) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న వైద్యసిబ్బందిని సత్కరించారు. కార్యక్రమంలో డా. వికాస్, డా.జ్యోష్ణ, సంస్థ ప్రతినిధులు వెంకటరమణ, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

◆ **పశువులకు టీకాలు వేయించాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): లంపిస్కిన్ (ముద్ద చర్మ వ్యాధి) పశువులకు సోకడంవల్ల ప్రమాదం సంభవిస్తుందని పశువులకు ముందుజాగ్రత్తగా టీకాలు వేయించాలని మండల పశువైద్యాధికారి రాజు తెలిపారు. బుధవారం మండల కేంద్రం కౌడిపల్లిలో తెల్లజాతి పశువులకు (ఆవులు, ఎద్దులు) ప్రభుత్వం పంపిణీ చేసిన ఉచిత టీకాలను వేశారు. కార్యక్రమంలో జేవీఓ కృష్ణకుమార్, వీఏ చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

◆ **పంట పరిశీలన**

చిన్నశంకరంసపేట(మెదక్): నార్సింగి మండలం భీంరావుపల్లి గ్రామంలో పంటలను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పంట సాగు వివరాలు తెలుసుకోవాలని పంటపొలాలను సందర్శించినట్లు ఏడీఏ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఓ విజృంబన, రైతులు పాల్గొన్నారు.

◆ **కట్ట వెడల్పు పనుల పరిశీలన**

శివ్వంపేట(నర్సాపూర్): రైతుల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్న స్వచ్ఛంద సంస్థల సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ హరికృష్ణ అన్నారు. మండల పరిధిలోని చండీ గ్రామ పరిధిలోని ఎదుల్లాకుంటను సెహగల్ స్వచ్ఛంద సంస్థ అభివృద్ధి చేస్తుండడంతో బుధవారం పనులను పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ వేమనారాయణ, తదితరులు ఉన్నారు.

◆ **సన్మానం**

రామాయంపేట(మెదక్): పట్టణంలో తహసీల్దార్ కార్యాలయ ఉద్యోగి బైరం భూమయ్య పదవీ విరమణ కార్యక్రమంలో బుధవారం కార్యాలయంలో తహసీల్దార్ రజనీకుమారి పాల్గొన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్‌తో పాటు ఇతర ఉద్యోగులు భూమయ్య దంపతులను సన్మానించారు. ఆర్ఐ రాజు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

◆ **ఎంజేపీ బాలుర డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు**

కౌడిపల్లి(నర్సాపూర్): ఎంజేపీ బీసీ బాలుర డిగ్రీ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లకు విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఉమ్మడి మెదక్ జిల్లా ఆర్‌సీఓ (రిజనల్ కోఆర్డినేటర్) ప్రభాకర్, తునికి ఎంజేపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ హరిబాబు తెలిపారు. ఇంటర్‌లో ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈనెల 4 నుంచి 8 వరకు తునికి ఎంజేపీ బీసీ గురుకుల పాఠశాలలో స్పాట్ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.ఇతర వివరాలకు 77024 11445, 94923 04582 నంబర్లకు సంప్రదించాలని తెలిపారు.

◆ **రామాయంపేట అభివృద్ధి ఏదీ.?**

రామాయంపేట(మెదక్): బీఆర్ఎస్ గద్దె దిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా రామాయంపేట మున్సిపాలిటీ ఎంతమాత్రం అభివృద్ధి సాధించలేదని బీజేపీ సీనియర్ నాయకులు శంకర్‌గౌడ్, నరేందర్ అన్నారు. బుధవారం ఈ సందర్భంగా వారు విలేకరులతో మాట్లాడారు. మున్సిపాలిటీ అభివృద్ధి కోసం ప్రత్యేకంగా నిధులు మంజూరైనట్లు చెప్పుకుంటున్నారే తప్ప పనులు ప్రారంభించిన దాఖలాలు లేదని వారు పేర్కొన్నారు.

◆ **డ్రగ్స్‌ను అరికట్టడం యువతతోనే సాధ్యం**

తూప్రాన్: డ్రగ్స్‌ను అరికట్టడం యువతతోనే సాధ్యమవుతుందని ఆర్డీఓ జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పట్టణ పరిధిలోని పోతరాజుపల్లిలో కొనసాగుతున్న మహాత్మా జ్యోతిబాపూలే బాలికల బీసీ వెల్ఫేర్ (వెల్దుర్తి) పాఠశాలలో విద్యార్థినీలకు, ఉపాధ్యాయ బృందానికి, వేర్వేరుగా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ వందన, వైస్ ప్రిన్సిపల్ రమాదేవి, వార్డన్ పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

◆ **సాగు వివరాల నమోదు తప్పనిసరి**



పెద్దశంకరంపేట(మెదక్): రైతులు తమ పంటల సాగు వివరాలను తప్పకుండా వ్యవసాయ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని ఇన్‌చార్జి ఏఈఓ యాదగిరి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చీలాపల్లిలో పత్తిపంటతో పాటు జనుము, జీలుగ సాగును ఆయన పరిశీలించి రైతులకు పలు సూచనలందించారు. కార్యక్రమంలో ఏఈఓ మమత, రైతులున్నారు.